# శిక్ష

గొల్లపూడి రాజ్యలక్ష్మి



సాయం సంధ్య ఎరుపు—తెలుపు—నలుపు—కలిపిన చీరె ధరించి శృంగారరంగానవ్వింది. విరిసిన పాలల్లా ఆకాశం మెరుస్తోంది. దూరాన రెక్కలు టపటపా కొట్టుకుంటూ కొంగలు బారులు—బారులుగా సాగిపోతున్నయ్. అదోవిధమైన అందం! అనుభూతి!! ప్రకృతిలోని చలనాన్ని అవలోకిస్తూ తన్మయత. ఎంతసేపైనా చూపులు మరల్చ లేని ఆకర్షణ.

మెత్తని పచ్చగడ్డిలో—చేతుల్ని తలక్రింద అమర్చుకుని—వెల్లికిలా పడుకుని తదేకంగా మేఘాలవైపు—ఆకాశంలోని — నీలిమవైపు చూస్తోన్న శ్యామసుందరి దగ్గరికి రాధ వచ్చింది.

'చీకటి పడ్తోంది! క్రిందికి దిగి పోదామా?' అడిగింది రాధ.

'పోదాం లెద్దూ! ఇక్కడే...ఇలాగే ఎన్ని రోజులైనా...' ఎన్ని యుగాలైనా...వుండి పోదామనిపిస్తోంది రాధా! రాధ చేతిని తన చెంపకు అద్దుకుంటూ అన్నది శ్యామ సుందరి.

'నిజమే అనుకో! అసాధ్యమైనదాన్నే సాధ్యం అవాలని కోరుకుంటాం మనం—కానీ నీవు కోరుకున్నదే నిజంగా జరిగితే విసుగెత్తిపోతుంది.' నవ్వింది రాధ.

'లేదు! ఎన్నటికీ విసుగెత్తదు—ఇంత అందాన్నీ—ప్రశాంతతనీ—నైర్మల్యాన్నీ కావాలని అనుక్షణం కోరుకునే మనకు—అవి లభిస్తే—కోరిక నెరవేరిందనే తృప్తీ—సంతోషం మిగులుతాయి.?

'నీవు ఊహల్లో జీవిస్తావు' శ్యామ సుందరీ! వాస్తవంగా ఆలోచించు. కడుపు నిండా తిండీ—నిద్రా అన్నీ లభ్యమైనాక—ప్రకృతిలోని అందం — ఆకాశంలోని రంగులు ఆహ్లాదకరంగా వుంటయ్. — ఆ రెండూ లోపిస్తే మనసులో ఇలాంటి భావాలకు తావేవుండదు...' మితిని తప్పి—అతిని భరించలేదు మానవహృదయం."

గలగలా నవ్వింది శ్యామసుందరి.

'మానవహృదయం మీద రీసెర్చి చేస్తున్నావా?'

'లేదు! కొన్ని సత్యాలు ప్రత్యక్షంగా కన్పిస్తోంటే ప్రత్యేకంగా పరిశోధన లెందుకు?'

'నీతో వాదించలేను బాబూ! నన్నిలా వదిలెయ్! నీకు పుణ్యముంటుంది!'

'నేనూ సౌందర్యాన్వేషిణినే శ్యామసుందరీ! కానీ సమయం సందర్భంవున్నది!''

'ఇంతకీ ఏమిటి నువ్వనేది?' లేచి కూర్చుని ఆశ్చర్యంగా కళ్ళల్లోకి చూసింది.

'చీకటిపడ్తోంది. అపరిచితమైన ప్రదేశం. ప్రమాదభూయిష్టమో - ప్రమోదభరితమో మనకేం తెలుస్తుంది? అదీ కాక సెక్రెటరీ వాసంతీ రాణి మనకోసం వెతుక్కోరూ?

'ఇలాంటి సుందరప్రదేశంలో—నిర్మలవాతావరణంలో—మామూలు గొడవలు రేపకు. నువ్వెళ్ళు—నీ వెనుకగా నేనూ వస్తాను.'

'సరే నీ యిష్టం! జాగ్రత్తగా వుండు. అసలైనా రేపు మళ్ళీ వచ్చి మిగిలినవి చూడొచ్చుగదా!'

'నిజమే రాధా! కానీ ఈ వెన్నెలరాత్రి అనుభవం పగలు ఎలావస్తుంది?'

రాధ మరి మాట్లాడలేదు. నెమ్మదిగా మెట్లు దిగుతూ వెళ్ళిపోయింది, క్రింద వున్న తమ గెస్ట్‌హౌస్‌కు. శ్యామసుందరి మనసునిండా హాయి ఆవరించుకుంది. సహజంగా ఆమె ఉద్రేకి. సుందరమైన ప్రకృతి దృశ్యాలకు పరవశించిపోతుంది. ఆ క్షణంలో మిగిలినవన్నీ తృణప్రాయాలే.

ఆ హాయిలో — ఆనందంలో — ఒంటరితనంలో—నిశ్శబ్దంలో— గొంతు పురి విప్పుతున్న నెమలిలా రాగతరంగాలతో నృత్యం చేసింది.

స్వేచ్ఛగా—మధురంగా గొంతెత్తి గోపికా గీతం ఆలాపిస్తోంది శ్యామసుందరి.

'నల్లనివాడా...
నే గొల్లకన్నెనోయ్.
పిల్లనగ్రోవూదుమోయ్ నా—
యుల్లము రంజిల్లుగా.
నల్లనివాడా...''

పాట పూర్తయింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా—మూగగా— అనిర్వచనీయమైన ఆనందంతో—తృప్తితో పడుకునుంది శ్యామసుందరి.

హఠాత్తుగా వాతావరణంలో మార్పు కన్పించింది ఆమెకు.

వెన్నెలకోసం చకోరిలా నిరీక్షిస్తున్న ఆమెకు ఆకాశనిండా ఆవరిస్తున్న నల్లని మేఘాలు గుంపులు -- గుంపులుగా కనిపించినయ్.

క్షణంలో దట్టంగా పట్టిన మబ్బులు— ఈదురుగాలీ మసకచీకటి!

హతాశురాలయిందామె!

ఇలాంటి సమయంలో కూడా అదోవిధమైన భయానకసౌందర్యం ప్రకృతిలో కానవచ్చినా—క్రిందికి చేరుకోవటమే క్షేమదాయకమని మనసు హెచ్చరించింది.

తటిల్లత మెరిసిన మెరుపు వెలుగులో బారెడుదూరాన కనిపించిన పురుషాకారం గమనించి స్థంభించిపోయింది శ్యామసుందరి.

అడుగడుగునా మెరుస్తున్న మెరుపులవల్ల అతను తనవంకే దీక్షగా చూస్తున్నట్లు గ్రహించింది. అవ్యక్తమైనభీతి ఆవహించిందామెలో — ఏదో అనుకంపన — ఆరాటం! ఎలాంటిపరిస్థితిలో చిక్కుకుంది తను. రాధ హెచ్చరికను తనెందుకని సరకు చేయలేదు? పరాయివూరిలో స్వతంత్రభావన లెందుకు అక్కరకొస్తాయి?'

సన్నని జల్లు మొదలైంది.

ఇంకోసమయంలో అయితే ఆ వర్షం జల్లులో తడవటమూ ఆనందకారణమే శ్యామసుందరికి.

కానీ....

'ఈ వూరికి మీరు క్రొత్త అనుకుంటాను?' పురుషాకారం పలికిందీ మాటలు.

'అవును! అవును!!' అన్నాననుకుంది. లోపలే అణిగిపోయినయ్ తన నిస్సహాయత గుర్తుకు తెచ్చుకుని.

'మిమ్మల్నే! భయపడతారెందుకు! నేను సహాయం చేయగలను!'

హృదయంలోని పవిత్రత మాటల్లో వ్యక్తమైంది.

'థాంక్స్! అవసరంలేదు. దారి తెలుసు. దిగిపోతాను.' వొణుకుతున్న స్వరాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ అన్నది,

'చాలా కేర్‌ఫుల్‌గా వుండాలి. వర్షానికి మెట్లు జారవచ్చు! నెమ్మదిగా మీ ఎడమ చేతివైపు ఫర్లాంగు నడిస్తే మెట్లు అవుపడతాయి.' వివరణగా చెప్పేడతను.

'మెనీ థాంక్స్!' ఆమె మెల్లిగా ఎడమ దిశ మెరుపుల వెలుగులో నడవసాగింది.

వర్షం ఎక్కువైంది. చీరంతా తడి—చలి! ఏమిటీదురదృష్టం?.

'నా దగ్గరున్న ఈ గొడుగు తీసుకోండి! మీరు ముద్దలా తడిసిపోతున్నారు.' వెనుకగా వస్తున్న అతను గొడుగు అందించబోయేడు.

శరీరం 'తీసుకో'మని తొందర చేస్తున్నా —మనసందుకు వ్యతిరేకిస్తోంది.

'ఫర్వాలేదులెండి!' అన్నది ముక్తసరిగా బలవంతంగా చేతికందించేడతను.

'మీరు...మీరు తడిసిపోతున్నారు.'

జాలిగా, బాధగా అన్నది.

'నా కలవాటేలెండి ఫర్వాలేదు...మీరు జాగ్రత్తగా నడవండి.'

'క్షమించండి! మీరు ఈ గొడుగులోకి రాకూడదూ? ఇదేమి న్యాయం? మీ గొడుగుతోనే సంరక్షణ కల్పించుకోవటమా? నవ్వింది చిన్నగా శ్యామసుందరి. స్వాభావికంగా ఆమెది సరళమైన హృదయం కలుపుగోరుతనం! క్షణంలో మాట కలిపేస్తుంది.

అతనూ నవ్వి—నెమ్మదిగా గొడుగులో కొచ్చాడు. మాటలు కలిశాక — సంభాషణ పెరిగింది.

'నేను ఇక్కడి ప్రకృతి సౌందర్యసంపద గురించి విని నెలరోజుల క్రిందట వచ్చాను చలపతిరావు అంటారు నన్ను' పరిచయం చేసుకొన్నాడు.

'నా పేరు శ్యామసుందరి. మాది హైదరాబాద్. మహిళామండలి మెంబర్‌ని నేను. మా క్లబ్‌లో అంతా కలిసి విహారయాత్రగా — సౌందర్యాత్మకంగా ఎన్నికగన్న ఈ హిల్స్ చూడటానికి వచ్చాము.'

'మిస్...శ్యామ...'

'నో...మిసెస్ శ్యామసుందరీనాథ్.'

'సారీ! మీవారెందులో పనిచేస్తున్నారు?'

చెప్పింది.

'మీ రిలా ఒంటరిగా...'

సిగ్గుపడి సంగతి వివరించింది మెల్లిగా—అతని యెడల ఏర్పడిన సదభిప్రాయప్రోద్బలంతో. ఈదురుగాలి ఎక్కువైంది గొడుగు వున్నా పక్కనుంచి జల్లుపడి బట్టలన్నీ నీళ్లు కారుతున్నయ్.

మెరుపులు — ఉరుములు!

ఘోరున వర్షం—ఈదురుగాలీ.

గాలి తీవ్రతకు గొడుగుతోపాటు పైకి లేచిన శ్యామసుందరి కీచుగా అరిచింది భయంతో. మెట్లమీద బ్యాలెన్సు తప్పింది చటుక్కున ఆమె నడుము పట్టుకుని ఆపు చేశాడు చలపతిరావు.

చేతిలోని గొడుగు వదిలిపెట్టింది శ్యామసుందరి. గాలివాటుగా కొట్టుకుపోయిందది.

నెమ్మదిగా మెట్టుమీద కాళ్లను బలంగా అదిమి పెట్టబోయిన ఆమెను— చలపతిరావు గట్టిగా తనవైపు తిప్పుకుని హృదయానికి హత్తుకోవటంతో — మతిపోయినంత పనైంది.

'ఏమిటిది? ఏమిటీ ప్రళయం?' కంపించి పోయింది. మరింత బలంగా— గాఢంగా తనలోకి లాక్కుంటున్నాడు.

చలికి వణికే శరీరానికి ఈ వెచ్చదనంలో హాయి కనిపించినా-- అంతరాత్మ — మనసు ఓకటే గోలగా రోదవేస్తోన్నాయి.

# హెడన్సా




మూల వ్యాధులకు.

ప్రతి చోట దొరుకును

3 నెలలు ఉచిత బహుమతి



స్త్రీలకు అందాన్నిచ్చే కాశ్మీర్ ఆర్ట్ చీరెలు:సరికొత్త ఆకర్షణీయమైన నమూనాలలోను రంగులలోను యిూ బుతువుకు తగినట్లు మావద్దగలవు పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్-చీరెరు. 11లు; 2కి రు. 20లు; 3 కి రు. 28లు; 4కి రు. 36/- రెండు లేక అంతకు పైచీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును పోస్టు పార్శిల్ ద్వారా పంపెదము

ARVIND AGENCIES (APW-22)
P. B. 1408, Delhi-6.

## తెల్ల వెంట్రుక లుండవు

పొగడడం మాకు ఇష్టం లేదు. కాని "మా కేష్ రంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగామార్చును. మొదట తెల్ల వెంట్రుకలునల్లనిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరుచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు ధర రు. 10/-

Bengal Ayurved Bhawan (55)
P. O. Katri Sarai, (Gaya)

## వాయిదాల పద్ధతి పై ట్రాన్సిస్టర్

రు. 265/- విలువగల ప్రపంచ ఖ్యాతి పొందిన "విండ్సర్ హిటచి" 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను



నెలసరి వాయిదాలపై రు. 25/- వంతున చెల్లించి పొందండి. వివరములకు :

Swiss Television Co. (AP-55)
P. O. Box 1320, Delhi-6.


## శిక్ష

విడిపించుకో...పారిపో ... హెచ్చరిస్తున్నయ్.

గింజుకుంది—పట్టు సడలలేదు.

విదిలించించి—మరింత దగ్గరికి తీసుకున్నాడు.

కొన్ని క్షణాల తర్వాత—బలాన్ని శక్తినీ కూడ దీసుకుని—

'పిడువండి' ఏమిటిది? — నమ్మించి గొంతుకోస్తారా?' వొణుకుతూన్న స్వరంతో దీనంగా అన్నది.

పాదాలను మెట్లమీద బలంగా బంధించి— ఆమెకు సమాధానంగా పెదవుల్ని బంధించాడు చలపతిరావు.

శ్యామసుందరి శరీరం అలసి మనసు కళ్లు చీకటి క్రమ్ముకు పోయినయ్. కొన్ని నిమిషాలకు కుప్పలా క్రింద మెట్లమీద కూలిపోవటం వరకు తెలును ఆమెకు.

*     *     *

కాఫీ త్రాగి కప్పు టీపాయ్‌మీద వుంచి పెదవుల్ని తుడుచుకుంటూ ఓరగా జగన్నాథం వైపు చూసింది శ్యామసుందరి.

సిగరెట్ వెలిగించి పొగరింగులుగా వదులుతూ చిన్నగా దగ్గాడతను —

'నాకేం అర్థం కావడంలేదు శ్యామా! ఏమిటి నీ బాధ? ఈ మౌనం ఏమిటి? ఎందుకు చెప్పవు?'

'బావుంది! ఏం చెప్పమంటారు?' నవ్వింది నిర్జీవంగా.

'అదిగో...అదే!...ఆ నవ్వులో ఎంత పెసిమిజం వుందనీ! అదిచాలు నీ మనోభావానికి నిదర్శనంగా.'

మాట్లాడలేదామె. తలవంచుకుని ఏదో ఆలోచిస్తోంది

'నిన్న కార్యదర్శి వాసంతీరాణి ఫోన్ చేసింది.— నిన్నటిఫంక్షన్ కు నువ్వెందుకువెళ్ల లేదు? మహిళామండలిలో నీవు లేనందువల్ల చాలా నిరుత్సాహంగా వుందంది. నన్ను — నిన్ను ప్రోత్సహించి పంపమని వేధించింది ఇదంతా ఏమిటి శ్యామా? నాకు మతిపోతోంది.' లేచి విసుగ్గా పచార్లు చేయ సాగేడు.

'ఏమిటోనండీ! ఎక్కడికీ పోవాలనిపించదు హాయిగా ఒంటరిగా ఉండిపోతే చాలు అనిపిస్తుంది. ఆ మహిళామండలి కార్యక్రమాలమీద విసుగువేస్తోంది నాకు.'

ఆశ్చర్యంగా చూశాడతను—ఆగి ఆమె వంక.

'అదిగో ఆమార్పే ఏమిటి అని అడిగేది? ఎన్నోసార్లు సినిమా ప్రోగ్రాం కూడా కేన్సిల్ చేసేసి ఉత్సాహంగా మీ క్లబ్ కు వెళ్లలేదూ నువ్వు? చెప్పు శ్యామా!

ఆలోచిస్తుంటే ఒకటి అనిపిస్తోంది నాకు—మీ పిక్నిక్ నుంచి తిరిగివచ్చి నప్పటినుంచి— అదోలా నిరుత్సాహంగా కని పిస్తున్నావు. అక్కడేమైనా జరిగిందా?' ఆమె ప్రక్కనే సోఫాలో కూచుని మొహం తనవైపు తిప్పుకున్నాడు.

ముత్యాల్లా మెరుస్తున్న కన్నీటి బిందువులు రెప్పలమీద నుండి అతని చేతుల్లోకి రాలినయ్.

'శ్యామా...' ఉలిక్కిపడ్డాడు జగన్నాథం.

ఉద్వేగంతో అతని హృదయంలో తల దాచుకుంది. పొంగుకువస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ. మౌనంగా ఆమె తల నిమురుతూ ఉండిపోయాడు జగన్నాథం.

*     *     *

'హలో! శ్యామసుందరీ!' నవ్వుతూ రాధ ప్రవేశించింది.

చనువుగా ఆమె ప్రక్కనే కూర్చుని భుజంమీద చేయివేస్తూ—'ఎంత చిక్కిపోయావు నువ్వు? నీ మనసులోని బాధ నాకు చెప్పవూ?' అన్నది అనునయంగా రాధ.

నిట్టూర్చింది శ్యామసుందరి.

'మీరంతా నన్నెందుకిలా వేధిస్తున్నారో నాకర్థం కావటంలేదు!'

'లేదు శ్యామసుందరీ! నువ్వు దాస్తున్నావు అరోజున - మనోహర ప్రకృతికి పరవశించిన నీ ఉత్సాహం - ఆనందం ఇప్పుడు మటుమాయమైనయి. వర్షంలో మెట్ల మీద కుప్పలా కూలిపోయిన నీవు-తరువాత ఎంత ముభావంగా—నిర్లిప్తతో తిరిగి వచ్చావో నేను మర్చిపోగలనా? ఏంజరిగింది? చెప్పు! చెప్పు శ్యామసుందరీ?'

అలవిగాని ఆవేదనతో—అవమానంతో మనసు భగ్గున మండుతోంది. క్షణక్షణం మూమర్చిపోదామన్నా—మరుపురానీయకుండా కెలుకుతున్నారీ వ్యక్తులు!

ఏమని చెప్తుంది?

శీలం కోల్పోయి పతితగా మిగిలిందనా?

తన జీవితంలోని-పవిత్రత-శాంతి లుప్త మయినాయనా?

నీమాటలు అలక్ష్యం చేసిన ఫలితం అను భవించిందనా?

ఏమని చెప్తుంది?

నిట్టూర్చింది గాఢంగా-రాధ.

'ఇన్నాళ్ళూ నేనెంతో గర్వించాను. ఎందుకో తెలుసా? మనసు విప్పుకుని— మమతలు పెంపొందించుకుని విలువైన స్నేహానికి నిర్వచనంగా మెలుగుతున్నామని. కానీ- నీ బాధతో నాకు నిమిత్తం లేదా? నీ మనోవ్యాకులతలో నేను జోక్యం చేసుకో కూడదా? నీ దృష్టిలో నేను కేవలం ఒట్టి రాధనేనా? చెప్పు! నా ప్రశ్నకి సరి అయిన సమాధానం చెప్పు-నేను వెళ్ళి పోతాను నిన్ను బాధించటం నా ఉద్దేశం కాదు. నీలోని నిర్లిప్తతను-అంతర్లీనమై వున్న ఆవేదనను నిర్మూలించాలనే నా తాప త్రయం.'

శ్యామసుందరి రాధ చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కి వదిలి పెట్టింది.

'నన్ను అర్థం చేసుకో రాధా! నేనిప్పు డేమీ చెప్పలేను. ఎప్పుడో ఒకరోజు నేనే నిన్ను పిలిచి అంతా చెప్తాను. ప్లీజ్ నన్నిప్పుడేం అడక్కు!'

అరచేతులతో ముఖాన్ని కప్పుకుంది.

రాధ నిష్క్రమించటంకంటే ఏంచేస్తుంది?

'బాధపడకు! నీ ఇష్టప్రకారమే జరుగు తుంది. ఎల్లుండి గోల్కొండ పోదాం వస్తావా?' చేతుల్ని విడదీస్తూ అడిగింది.

'క్షమించు రాధా! నేనెక్కడికీ రాలేను.'

'నీలో బాధవుంటే-ఎదుటి మనిషికి చెప్పు! లేదా గోప్యంగా దాచుకో. అంతే కానీ...ఇలా పరిసరాల్నీ వ్యక్తుల్నీ సందిగ్ధా వస్థలో వుంచటం ఏం సబబు? చలాకీగా గలగలా ప్రవహించే సెలయేటిలా వుండే నీవు స్తబ్ధుగా—నీరసంగా—నిర్లిప్తతగా దిగులు గడ్డకట్టినట్లు—ప్రవర్తిస్తే నీ సన్నిహితు లకు ఎలా వుంటుంది? మనసు కెలికి నట్లు వుండదూ? అంత బాధలో నిన్ను కారణమడగకూడదు. ఇదేం న్యాయం శ్యామ సుందరీ?'

మాటల్లో రాధను ఓడించడం కష్టం. ఈ విషయం ఇప్పుడుకాదు—ఎప్పుడో తెలుసు

# శిక్ష

శ్యామసుందరికి—మౌనంగా కొన్ని క్షణాలు ఆలోచించి-

'సరే!-వస్తాను' అన్నది ఎటో చూస్తూ.

'నేను వెళ్తాను. కానీ ఓ చిన్న విన్నపం. నీ బాధల్లోనూ, సంతోషంలోనూ పాలు పంచుకునే-నీ భాగస్వామిని క్షోభ పెట్టటం నీకు న్యాయంకాదు. సాధ్యమైనంతవరకూ నిన్ను నిగ్రహించుకో. అవతల మనిషి గురించి అర్థం చేసుకో!'

రాధ వెళ్ళిపోయింది.

తన మనసులోని భారం తీరేలా వెక్కి— వెక్కి ఏడ్చింది శ్యామసుందరి.

'ఇక తన జీవితమింతేనా? ఆడదానికి భూషణంలాంటి శీలం కోల్పోయిన తర్వాత జీవితానికి అర్థమేమిటి? ఎవరికోసం తను? అసలు తనిలా బెంబేలు పడతోందెందుకని? ఎవరికి తెలుసు? మనసుకు-భగవంతుడికీ తప్ప! నలుగురిలో తనెందుకిలా ప్రత్యేకంగా కన్పిస్తోంది?

అతనో...! అతను!

ఎవరో-ఏమిటో?

తను అడగలేదు-అసలు వ్యాధి ఏది?

తిరిగి తనకు కన్పిస్తాడని నమ్మకం ఏమిటి?

వివరాలు కనుక్కొని ఏం చేస్తుంది?

ఏం చేయగలదు?

కొట్టేస్తుందా?

కొట్టేస్తే వచ్చిన మచ్చ మాసిపోతుందా? అల్లరి వడటం తప్పించి!

లాభంలేదు!—తనేవిధా చేయలేదు

రాధ చెప్పినట్లు గతం నశోభావు! భవిష్యత్ ఏమిటి? మామూలు మనిషిలా ఎలా మారిపోగలదు?

ఇలా బాధపడి ప్రయోజనమేమిటి?

ఆయన అడుగుతున్నారు— 'ఏమిటి శ్యామా' అని.

ఏం చెబుతుంది?

ఎంత భర్తయితే మాత్రం?

ఎంత సన్నిహితుడైతే మాత్రం?

* * *

గోల్కొండ ఎక్కి చదునుగా వున్న ఓ బండమీద కూర్చున్నారు రాధా శ్యామ సుందరీ—మరో క్లబ్ మెంబరు జయ ప్రభా—అస్తమిస్తోన్న సూర్య బింబాన్ని చూస్తూ.

'మొన్న మీటింగ్‌లో నళిని ప్రసాద్ భలే దంచిందిలే లెక్చర్! నువ్వు లేవుగానీ శ్యామ సుందరీ. వచ్చివుంటేనా మంచి మెటీరియల్ దొరికేది నీకు. నువ్వుంటే బాగుండేదనీ— నళినికి సమాధానం ఘాటుగా చెప్పి వుండేదానివనీ అందరం అను కున్నాము.'

'యు సిల్లీ జయా! ఇలాంటి అందమైన సాయంత్రం నళిని సంగతి ఎత్తుతావేం' రాధ విసుక్కుంది. చిన్న పుచ్చుకున్న జయను చూస్తూ—

'లేదు జయా! ఆరోజు నా ఆరోగ్యం బావుండలేదు. వద్దామని చాలా ట్రై చేశాను. ముఖ్యంగా ఫోర్సు చేసేరని ఆయన చెప్పగా నే—మిమ్మల్ని డిజప్పాయింట్ చేశా నేమోనని చాలా బాధపడ్డాను తర్వాత.' అన్నది శ్యామ సుందరి.

'అదిగో అటు చూడు శ్యామసుందరీ! కుంగిపోతున్న సూర్యుని మరుగుపరుస్తూ ఆ మేఘ శకలం అడ్డురాగా-ఆ సూర్య కిరణాలు స్పష్టంగా ఎలా ప్రతిఫలిస్తు న్నాయో!'

'ఫుల్‌స్టాప్ రాధా! నీకీమధ్య ప్రకృతి మీద ధ్యాస ఎక్కువవుతోందేమిటి?' జయ నవ్వింది. శ్యామ సుందరీ-అవునన్నట్లు జత కలిపింది ఆమెలో మెల్లి—మెల్లిగా దూర మౌతోన్న ఒంటరితనమూ — నైరాశ్యం— మౌనం గమనించింది రాధ.

'మన సెక్రటరీ వాసంతీరాణి మొన్నటి ఫంక్షన్‌కు గులాబీరంగులో జరీ బోర్డ రున్న చీరె కట్టుకొచ్చింది. ఎంత బావుం దనీ! బొంబాయి వెళ్ళినప్పుడు వాళ్ళాయన తెచ్చేరట!' జయ చెప్పుకుపోతోంది. పర ధ్యాసగా వింటున్నా రిద్దరూ ఎవరి ఆలోచ నల్లో వారు సతమతమవుతూ.

* * *

'శ్యామూ! రెండు కాఫీలు పట్టుకురా!' జగన్నాథం కేకేశాడు.

ట్రేలో కాఫీపట్టుకువచ్చిన శ్యామసుందరి అశక్తత గడ్డకట్టినట్లు గుమ్మంలో పాతుకు పోయింది.

అతను...అతను...

చలపతిరావు కదూ!

స్తంభించిన శ్యామసుందరి రెప్ప వాయి కుండా బొమ్మలా అతనివైపు చూస్తుంది

పోయింది.

చలపతిరావు తెల్లబోయేడు ఆమెను చూస్తూనే. ఏదో అవ్యక్తమైన భయం శరీరాన్నావరించింది. కళ్లెత్తి ఆమెను సూటిగా చూడలేక పోయాడు. అంతవరకు జగన్నాథంతో మనస్ఫూర్తిగా, సంతోషంగా, అవ్యక్తానందంతో మాట్లాడాడు. క్షణంలో మనసులో బెరుకు జంకు — ముళ్లమీద కూర్చున్నట్లు అనుభూతి కలిగినయి. అపరాధిలా తలవంచేసుకుని జగన్నాథం మాటలకు పొడిగా సమాధాన మివ్వసాగాడు.

'అదిగాదోయ్ సతీ! ఇంతకాలం నువ్వెందుకు వివాహం చేసుకోలేదు ? మమ్మల్ని ఆహ్వానించాల్సి వస్తుందనా ? లేక స్త్రీజాతి మీద కత్తిగట్టేవా ? ఈ రెండూ కాక భగ్న హృదయుడివా ? సరైన సమాధానం చెప్పవయ్యా మహానుభావా !' జగన్నాథం చనువుగా అతనిచేతిని నొక్కుతూ — ఆసక్తిగా అతనివంక చూస్తూ అడిగేడు.

ప్రతిమలా నిలబడిపోయిన శ్యామసుందరిని అతను గమనించలేదు. శ్యామసుందరి హృదయం అభిమానంతో — పరాభవంతో జ్వలిస్తోంది.

'తన జీవితాన్ని సమూలంగా నాశనంచేసి — హృదయంలో ఆరని అగ్నిని రగిల్చిన చలపతి ముందు తను మళ్లీ నిలబడటమా ? ఎంత ఘోరం ! ఇంతకంటే గుక్కెడు విషం తాగడం మంచిది కాదూ! ఏ విషయాన్నయితే— తేలికగా త్రోసివేసి భవిష్యత్‌ను క్రొత్తరూపంలో మలుచుకుందామని ప్రయత్నిస్తోందో—ఆ విషయాన్ని —ఆ భయంకరమైన సంఘటనకి గుర్తుకుతెస్తూ చలపతిరావు !

భగవాన్ ! నన్నీపాటున భూమిలోకి త్రొక్కివేయరాదూ ?' చేతులు వొణుకుతున్నయ్. వళ్లంతా స్వేదంతో తడిసిపోతోంది. కళ్లు తిరిగి పోతున్నయ్.

హఠాత్తుగా వెనక్కి తిరిగిచూసిన జగన్నాథం —'అరె! అక్కడే నుంచున్నావేం ? రా ! ఫర్వాలేదు. ఇతను నా ఆత్మీయుడేలే! చిన్నప్పుడు ఒకే ప్రాణంగా మెలిగేవాళ్లం — ఆ అనుబంధమే—ఇంత వయసు వచ్చినా మాసిపోకుండా అతన్ని నాదగ్గరకు లాక్కొచ్చింది.' అన్నాడు.

'కాదు ! నా దురదృష్టమే నన్నీస్థితిలో నిలబెట్టింది !' అని బిగ్గరగా అరవాలని పించిందామెకు.

చలపతిరావు మనసు మనసులో లేదు. జరిగినదంతా కలలా అన్పిస్తోంది అతనికి.

'ఆమె !...అనుకోకుండా ఆరోజున ప్రపంచంలోని శక్తులన్నీ ఏకమై తన్నశక్తుడిని జేసి జీవితంలో తిరిగి కోలుకోకుండా — క్రుళ్లి క్రుశించమని నిర్దేశించిన ఆరోజు... పైశాచిక కృత్యంతో నమ్మిన స్త్రీని వంచించిన ఆరోజును గుర్తుకుతెస్తూ తిరిగి ఈమె ఇక్కడ ప్రత్యక్షమవడ మేమిటి ? కలకాదుగదా! కాకపోతే ఇంతకంటే చిత్రమైన విషయం లోకంలో మరోటుందా ? ఆమెలో ఎలాంటిభావాలు చెలరేగుతున్నాయో ? తనను గురించి ఎంత నీచంగా తిట్టుకుని అసహ్యించుకుంటుందో ? ఒకవేళ...జగన్నాథానికి తెలుసా ?

తెలియదేమో !

'తెలిస్తే ?'

'రా శ్యామా! ఏమిటలా బిగుసుకుపోయావు ?' లేచి ఆమెదగ్గరగా వెళ్లి చేతిలోని ట్రే అందుకున్నాడు. మరో చేత్తో ఆమె భుజంపట్టి కుదుపుతూ —'యుసిలీ శ్యామా ! అతనేమనుకుంటాడు ? ప్లీజ్ మామూలుగా పలకరించు.'

శ్యామ సుందరి నిర్జీవమైన — కాంతి విహీనమైన కళ్లెత్తి అతనివైపు క్షణంలో సగంసేపు చూసి వెనక్కితిరిగి లోపలి కెళ్లిపోయింది

క్షణంసేపు నిర్భాంతబోయి తిరిగి తమాయించుకుని — 'ఏమీ అనుకోకోయ్ పతీ ! [illegible] లేదు' అన్నాడు.

ఫర్వాలేదన్నట్లు తలాడించాడు చలపతిరావు. అతనికి ఇక్కడ్నుంచి దూరంగా పారిపోవాలనే కాంక్ష తీవ్రంగావున్నది. శ్యామసుందరి జీవితంలో — మనసులో నిప్పులు పోసిన తను మళ్లీ ఆమె ఎదట నిలబడడం ఘోరమైన దుస్సంఘటన.

జగన్నాథం అందించిన కాఫీ సిప్ చేస్తూ మెల్లగా తన అభిప్రాయం వ్యక్తీకరించేడు.

'నే నింక వెళ్తాను జగన్నాథం!'

'అప్పుడే! ఇక్కడ ఒక్క పూటైనా వుండకుండానా? నిన్నాదరి పెడ్తాననేనా?'

'కాదు —ఈ పారికి క్షమించు.'

'పిచ్చిగా మాట్లాడకు! భోజనం చెయ్యందే నువ్వు కదలటానికి వీల్లేదు.'

'జగన్నాథం! ప్లీజ్...

'ఏమిటోయ్ నీ కంత అర్జెంటు? రాక ...రాక ఇన్నేళ్లకు దర్శన మిచ్చి ఒక్క రోజైనా నాతో సరదాగా గడుపకుండానా?'

చలపతిరావు ఎటూ మాట్లాడలేని పరిస్థితిలో పడ్డాడు.

వుండటానికి సుతరామూ మనసొప్పటం లేదు.

పోదామన్నా వీలుకానీయకుండా స్నేహ సంబంధంతో కట్టివేస్తున్నాడు జగన్నాథం.

చివరకు అయిష్టంగానే వుండిపోయాడు.

డైనింగ్ టేబుల్ దగ్గర వడ్డిస్తూన్న శ్యామసుందరిలో భయాందోళన చిహ్నాలే లేవు. ఒకరకమైన గంభీరత్వం—నిశ్చింత



హోటు చేసుకున్నయ్.

'మవ్వూ కూచోలేదేం?' అడిగాడు జగన్నాథం భార్యని.

'తర్వాత తింటాను!' ముక్తసరిగా అన్నది.

చలపతిరావు హృదయంలోని ఆందోళనతో సరిగా తినలేకపోయాడు. పసిమిరంగులో సున్నితంగా వున్న చేతుల్తో వడ్డిస్తున్న శ్యామసుందరి చేతుల్ని చూస్తూ అనుకున్నాడు.—' ఆమెకు తనంటే భయం తప్ప అసహ్యం లేదేమో. అసలిదంతా జగన్నాథానికి తెలుసా? తెల్సినా క్షమించి ఆదరిస్తున్నారా?' ఎటూ తేల్చుకోలేని సమస్యలతో ఓ నిర్ణయానికి వచ్చాడతను.

'శ్యామసుందర్ని ఏకాంతంగా కల్సుకుని — ప్రకృతిశక్తుల విజృంభణతో లొంగిపోయిన తన నైతిక ప్రవర్తనని—వ్యక్తిత్వాన్ని క్షమించమని,— ఉద్దేశపూర్వకంగా తనిక్కడికి రాలేదనీ—విధితన నిక్కడికి నడిపించుకొచ్చిందనీ ప్రాధేయపడి అనవసరమైన అపోహలతో మనసును పాడు చేసుకోవద్దని హెచ్చరించివెళ్లిపోతాను అవును అదే సరైన పద్ధతి.'

హాల్లో సోఫాల్లో కూర్చుని చిన్ననాటి ముచ్చట్లను గుర్తు తెచ్చుకుని పునశ్చరణ చేసుకుంటూ తాంబూలాలు సేవిస్తున్నారు స్నేహితు లిద్దరూ.

జగన్నాథానికి...అర్జెంట్ ఫోన్ కాల్ వచ్చింది.

'పతీ! నే నొక్క పావుగంటలో వచ్చేస్తాను నువ్వు ఈలోగా వెళ్లిపోయావో మన స్నేహం ఇంతటితో ఆఖరనుకో!'

పతి సమాధానం ఇచ్చేలోగానే డ్రెస్ చేసుకుని వెళ్లిపోయాడతను.

అనుకోకుండా హఠాత్తుగా ఆ రోజు ఎదురైన పరిస్థితికి ఆశ్చర్యపడ్డాడు చలపతిరావు.' అయినా ఆ శ్యామసుందరి ఇక్కడ ప్రత్యక్షమవుతుందని కలగన్నాడా? చెలికాడు జగన్నాథం ఆమె భర్త అన్న ఊహే లేదు తనలో. కానీయ్. భగవంతు డెన్ని పరీక్షలు చేయదల్చుకున్నాడో!

అవాంఛనీయంగా జరిగిందేదో జరిగింది ఆ సంఘటనతో జీవితాన్నే మార్చుకోవాలని వుంది? జీవితంలో ఎన్ని పొరపాట్లు జరిగిపోవటంలేదు? ఎన్ని సమస్యలు ఎదురై పీడించి తొలగిపోవటంలేదు?? అలాగే ఇది

## శిక్ష

కూడా. శ్యామసుందరితో తనలో చెడు భావన లేనేలేదని ఒక్కసారి చెప్పేస్తే? ఆమె సంసారాన్ని కూల్చదోయటానికి రాలేదని అభయమిస్తే?

మొండిధైర్యం ఆవహించగా లేచి లోపలి గదిలోకి నడిచాడు.

కిటికీ ప్రక్క ఏదో యోచిస్తూ కూర్చునివున్న శ్యామసుందరి అతన్ని గమనించలేదు.

కొన్ని క్షణాలదాకా నిశ్శబ్దంగా నిలబడిపోయాడు. నెమ్మదిగా చేరుకుని.

'శ్యామ....'

పూర్తిగా పిలవనేలేదు దిగ్గున లేచిందామె. కళ్లల్లో భయం విస్ఫోటత,— పెదవుల్లో వణుకు స్పష్టంగా గోచరిస్తోంది.

'ఏంకావాలి మీకు?' కంగారుగా అడిగింది.

సమాధానం దొరకలేదు చలపతిరావుకి అంతకుముందు చేసుకున్న నిర్ణయాలు మరచిపోయాడు. తడిసిన పద్మాల్లా వున్న ఆమె కన్నులు అతన్ని నిశ్చేష్టుడిని చేసినయ్ మౌనంగా—తదేకంగా చూస్తూ నించున్నాడు శ్యామసుందరిలో కంగారు, అదుర్దా ఎక్కువైంది 'ఏమిటితని వైఖరి! మళ్లీ తనతో పనేమిటి? అందులో అయన లేకుండా— ఏమిటితని ఉద్దేశం?' వణికిపోయింది నిలువెల్లా.

గుమ్మానికి అడ్డంగా నిల్చునివున్న చలపతిరావు ఆమె కళ్లకు యముడిలా—పులిలా—ఆకలిగొన్న మృగంలా కన్పించాడు.

'ఏంకావాలి మీకు?' రెట్టించింది.

అప్పటికీ అతన్లో చలనం లేదు.

'ఆ రోజు...చీకట్లో...మసక వెలుగులో స్పష్టాస్పష్టంగా అవుపించిన శ్యామసుందరిలో ఇంత అందం వున్నదా? ఇంత అమాయకత్వం వున్నదా? పువ్వుకంటే సుకుమారంగా వున్న ఈమె శరీరం స్పృశించగానే తనలో వాంఛ రేకెత్తడంలో అసహజమేమీలేదనిపిస్తోంది. నిజంగా జగన్నాథం ఎంత అదృష్టవంతుడు. ఇంద్రధనస్సులోని మెరుపులా ఈమె సౌందర్యం అనిర్వచనీయం!' ఎంతసేపైనా అలా ఆ కళ్లల్లోకి చూడాలనే కోరిక అతనిలో అధికమైంది. అనుకోకుండానే ఓ అడుగు ముందుకువేశాడు.

చలించిపోయింది శ్యామసుందరి. భీతితో మనసు బండబారిపోయింది అతనికళ్లల్లోని వాంఛ. స్పందన ఆమెను అవాక్కురాలిని చేసినయ్ మళ్లీ ఏదో ప్రళయం సిద్ధమవుతోంది.

'ఏంచేయాలిప్పుడు? ఏంచేయాలి?'

అసంకల్పితంగానే మరో అడుగు ముందుకు పడింది. శ్యామసుందరిలో హఠాత్తుగా తెగువ వచ్చింది. 'తన ఆనందానికీ, సంతోషానికీ, మనశ్శాంతికి సమాధి కట్టిన చలపతిరావు తనకు బారెడు దూరంలో నించునివున్నాడు.—తిరిగి అదే తప్పు చేయటానికి సిద్ధంగా. ఆవేశం ఒక్క ఊపు ఊపింది. అతను ఆమె చెయ్యి పట్టుకోవడం, వెంటనే చెంపలు ఫెడీ-ఫెడీమని మోగడం రెప్పపాటులో జరిగిపోయినయి.

ఉచ్ఛ్వాసనిశ్వాసలతో ఆమె గుండె లెగిరిపడుతున్నయి. 'నీచుడా! ఇంకా ఏం చెయ్యదల్చావు నన్ను? తృప్తి తీరలేదా? స్నేహంతో నమ్మించి — ఆపదలో ఆదుకున్నట్టు నటించి — నన్ను పరాభవించి నాశనంచేసింది చాలదా? నీ స్నేహితుడుని కూడా వంచించటానికి సిద్ధపడ్డావు. నువ్వు మనిషివేనా? కాదు పశువ్వి. మానవత్వం కొంచెమైనా నీలో వుండివుంటే— పాపభీతి వుండేది. వెంటనే ఇక్కడినుంచి వెళ్లిపో దూరంగా. తిరిగి నాకళ్లబడకు. ఒకవేళ కనిపిస్తే ఏంచేస్తానో నాకే తెలీదు —ఆడది అబల అనుకుంటున్నావేమో! పగ రగిలాలేగాని ప్రతీకారం చేయందే నిద్రించదు! త్రాచుపాము!' చరచరా వెళ్లిపోయిందక్కడ్నించి.

అరచేతులను చెంపలమీద వుంచుకుని అలానే విభ్రాంతపడి నిలుచుండిపోయాడు చలపతిరావు అతని కళ్లిప్పుడు శ్యామసుందరిలోని అందాల్ని వెదకటంలేదు బుసకొడుతూన్న రౌద్రంతో — తన కళ్లను కప్పిన పొరల్ని తొలగించిన ఆమె సాహసాన్ని, సౌశీల్యాన్ని చూస్తున్నయ్.—శ్యామసుందరి నిష్క్రమణతో చలపతిరావుకి తన తప్పేదం తెలిసింది. తనలో సమయంకోసం వేచివున్న దుష్టశక్తుల్ని గమనించి విభ్రాంతుడయ్యాడు—బలహీనత మనిషిని లొంగదీసి

ఇష్టంలేని పనుల్ని చేయిస్తుంది. కాకపోతే ఇదేమిటి? అసలు తనేఉద్దేశంతో వచ్చాడు? జరిగిందేమిటి భగవంతుడా! ఇంకా నన్నిలా జీవచ్ఛంలా ఉంచకపోతే చావును ప్రసాదించరాదూ? ఇప్పుడు జగన్నాథం మొహం ఎలా చూడగలడు?' ఎవరో వెన్నంటి తరిమినట్లు వెళ్ళిపోయాడక్కడినుంచి.

వడివడిగా అడుగువేస్తూ తన గదిలో కొచ్చిపడిన శ్యామసుందరి గుండెలు దడదడా కొట్టుకుంటూనే వున్నయ్. మంచంమీద పడుకుని దిండులో తలదాచుకుంది ఊరటగా జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది 'ఎంతటి హీనమైన పరిస్థితిలో పడేశావ్ భగవంతుడా!' అంటూ రోదించింది కొంచెం సేపు కొన్ని క్షణాల తర్వాత నెమ్మదిగా మనసు కుదుటపడింది ఆలోచిస్తూన్నకొద్దీ తనంటే తన కే ద్వేషం పుట్టసాగింది

'అంతా ఆయనతో చెప్పేస్తే?

తన మనస్సులోని భారాన్ని దింపుకుని రాధ సలహా తీసుకొంటే?

ఏమని చెబుతుంది? సిగ్గువిడిచి ఆమెతో ఎలా చెబుతూంది? ఎంత విషమపరిస్థితి! ఈ పరిస్థితుల్లో, ఈ అశాంతిలో ఏం చేయాలి?

ఆవేశంలో అతన్ని తీవ్రంగా అవమానించి—దూషించి వచ్చేసింది. ఒకవేళ చలపతి—తనపై కత్తికట్టి—ఆయనతో అంతా చెప్పేస్తే? ఏమని చెబుతాడు? అపరాధం అంతా అతనిలోనే వుందిగా. ఒకవేళ—నింద తనమీదవేసిపితే? అంత ఘోరానికి పాల్పడతాడా? ఏమో? ప్రాణస్నేహితుడి భార్యనైనా తలచక మళ్ళీ అనుమానించ బోనుకో లేదా? అతని కిదో లెక్కా? ఎంతటి క్రూరుడు కాకపోతే నమ్మించి గొంతు కోస్తాడా?

అవును! తప్పకుండా చెప్తాడు.

చెబితే ఆయన నమ్ముతారా?

ఏమో! ఏ క్షణాన మనసు మారుతుందో.

ఛి ఛీ! ఇలాంటి శంకితమైన బ్రతుకు తన కక్కర్లేదు-

దొంగతనం—చేసినా — బుద్ధి మార్చుకుని బ్రతకొచ్చు! మోసాలు చేసినా — నిజాయితీగా నిలబడొచ్చు! దరిద్రంలో మునిగి తేలుతున్నా—మంచిరోజులకోసం అన్వేషణలో నిరీక్షించవచ్చు! కానీ...కానీ...అనుమానాలతో—కుశంకలతో—అపారమైన జాలితో ఎవరి నీడను మనిషి బ్రతకలేడు. ముఖ్యంగా తను సహించలేదు.

ఏ దురదృష్ట దేవతో తన జీవితంలో ప్రవేశించి వక్రమార్గంలో పడేసింది తన జీవితనావను. స్నేహబాంధవ్యాలకూ — అభిమాన, భీతికీ చెలరేగిన సంఘర్షణ ఇక తను సహించలేదు.

స్త్రీకి అందం అలంకారం అంటారు. కానీ 'అదే తనకు శాపం అయింది. పరమ శత్రువయింది. తన అహంభావానికి—స్వాతిశయానికి తగిన శాస్తి జరిగింది!! వెక్కి వెక్కి ఏడిచింది మరోసారి శ్యామసుందరి.

'నిర్మలంగా—అప్రతిహతంగా సాగే జీవితవాహిని కల్మషమైపోయింది.

కానీ...ఆయన్ని ఎంతకాలం ఇలా బాధించాలి? తన అస్వస్థతకు అతను మనస్సులో ఎంత కుమిలిపోతున్నదీ తనకుతెలుసు. అపారమైన అనురాగంతో ఆదరించే అతనిని వంచించి బ్రతుకలేదు. అలా అని జరిగినదంతా పవిత్రంగా చెప్పి అతని దృష్టిలో పతితగా — అధమస్త్రీగా జీవించలేదు. వీటన్నిటికీ ఒకటే మార్గం — సుఖప్రదమైనదీ — శాంతిప్రదమైనదీ — మనిషికి కష్టాలనుంచీ — సమస్యలనుంచీ — బాధలనుంచీ — అశాంతినుంచీ విముక్తి ప్రసాదించేది!'

అదే...'చావు!' గట్టిగా నిర్ణయానికొచ్చింది శ్యామసుందరి.

* * *

రైల్వేస్టేషన్‌లో ఓ మూలగా పశ్చాత్తాపం ముద్దకట్టినట్టుగా కూచుని వున్నాడు చలపతిరావు. ఇద్దరు యువతులు అతనిముందునుంచీ నడిచివెళ్తూ అనుకొంటున్న మాటలు అప్రయత్నంగా చెవులబడినయ్.

'పాపం! శ్యామసుందరి! పూర్ ఫెలో! పండంటి సంసారాన్ని భగ్నం చేస్తూ ఆత్మహత్య చేసుకుంది.'

'అదే నాకూ ఆశ్చర్యమేస్తోంది. ఆమెకలాంటి కష్టమేం వచ్చిందో? ఎప్పుడూ నలుగుర్నీ ఉత్సాహపరిచేది.'

'ప్చ్' ఏమిటోలే! అలాంటివాళ్ళ మనసుల్లోనే అగాధాలుంటయ్. ఏ క్షణాన చావు రాసిపెట్టివుందో ఎవరికి తెలుస్తుంది? ఆమె ఎలాంటిబాధతో ఈ పనికి పూనుకుందో.'

అంతకంటే వినలేకపోయాడు చలపతిరావు.

శరీరం ముచ్చెమటలు పోసింది. కళ్ళముందు మసకమసకగా తెరలేవో కదిలినయ్. చెవుల్లో హోరున—'నువ్వే దోషివి! నువ్వే చంపింది' అనే వికటమైన స్వరాలు అరుస్తున్నయ్. అంతే...దిగ్గున లేచి పిచ్చిగా జుట్టు పీక్కుంటూ వెర్రిగా స్టేషన్ బయటకు పరిగెత్తాడు. ●

